## ఐస్ క్రీమ్‌ల లోడ్డు లారీలో చెలరేగిన మంటలు



కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తమిళనాడు నుంచి కోల్‌కతా _కు ఐస్ క్రీములు, పాల ఉత్పత్తుల లోడ్డుతో వెళ్తున్న లారీలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు మంటలు అదుపు చేశారు. ఈసంఘటన కుప్పం పట్టణం బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పాల ఉత్పత్తుల లారీలో ఒక్కసారిగా ఎసి పేలినట్లు సమాచారం దీంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలసి హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌ను సురక్షితంగా కాపాడారు. ఈ సంఘటనలో దాదాపు పది లక్షల దాకా నష్టం వాటిల్లిఉంటుందని సమాచారం. అనంతరం లారీలో ఉన్న సరుకును వేరే లారీలో తరలించారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## అప్రమత్తతో నిశిత తనిఖీలు చేయండి

### - ఆకస్మిక తనిఖీల్లో సివిఎస్వో హర్షవర్ధన్‌రాజు

తిరుమల, ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:



యాత్రికుల వాహనాలు తనిఖీల కోసం బారీగా వాహనాలు ఆగిపోయినా నిశితంగా పరిశీలించిన తరువాతే అనుమతించాలని, వాహనాల తనిఖీల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని తిరుపతి జిల్లాఎస్పీ, టిటిడి సివిఎస్‌ఓ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. స్కానర్ మానిటర్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి ఇమేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనుమానంగా ఉన్న వస్తువులను సిబ్బంది ఫిజికల్‌గా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

# పక్కాగా సూచనలు పాటింపు



జిల్లా అధికారులతో సమావేశం అయిన శాసనసభా అంచనాల కమిటీ

### - చర్చించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక
### - ఎపి శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

శాసనసభ అంచనాల కమిటీ నిర్వహించిన సమావేశంలో సూచించిన అంశాలను అధికారులు పక్కాగా పాటించాలని ఎపి శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో బుధవారం ఎపి శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు, కమిటీ సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మాట్లాడుతూ శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామనిపేర్కొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులను మంచినీటి సమస్య పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఉద్యానపంటలైన మామిడి, టమాట, పూల సాగు ఎక్కువగా వుందని, ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిలకు కేటాయించిన నిధులు పెంచాలని కలెక్టర్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఫోక్సో కేసు బాధితులకు అందించే నష్టపరిహారం నిబంధనల మేరకు ఇవ్వడం జరుగుతున్నదని, బాధితులు ఎక్కువ మొత్తం ఇవ్వాలని కోరుతున్నారని కమిటీ సభ్యులకు కలెక్టర్ వివరించారు. అలాగే మిషన్ వాత్సల్య కింద ప్రస్తుతం అందిస్తున్న నగదు మొత్తంను పెంచాలని, చైల్డ్ ప్రొటెక్షన్, బాలికా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ కమిటీకి వివరించారు. కమిటీ సభ్యులు పార్థసారధి వాల్మీకి మాట్లాడుతూ జడ్పీ నిధులను మంచినీరు, వైద్య రంగానికి అత్యధికంగా ఖర్చు చేయాలని, తద్వారా ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కమిటీ సభ్యులు మద్దిపాటి వెంకటరాజు గతంలో మంజూరు చేసిన పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గతంలో చేపట్టి పూర్తి చేసిన పనులకు యుటిలైజేషన్ సర్టిఫికేట్లు సమర్పించాలని, శాఖల వారీగా గణాంకాల వివరాలు కాకుండా పథకాల వారీగా మంజూరైన నిధులు, ఖర్చు చేసిన నిధులపై నివేదిక ఇవ్వాలన్నారు. కమిటీ సభ్యులు పాసిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. కమిటీ సభ్యురాలు వరుదు కళ్యాణి మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించి కేటాయించి నిధులు ఖర్చు చేసిన అంశాలపై గత పది సంవత్సరాల కాల వ్యవధిలో సమీక్షించడానికి అవకాశం వున్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు భూమి అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారధి వాల్మీకి, సాపిం సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీలు వరహా వెంకట సూర్యనారాయణ రాజు, వరుదు కళ్యాణిలు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, శాసనసభ అంచనాల కమిటీ డిప్యూటీ సెక్రటరీ ఎస్.రాజ్‌కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ సత్యనారాయణ, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్రశిక్ష ఎసిపి వెంకటరమణ, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బాలసుబ్రమణ్యం, ఎపిఎంఐపి పిడి ఆరీఫ్, హౌసింగ్ పిడి గోపాల్‌నాయక్, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారి చెన్నయ్య, మైనార్టీ శాఖ అధికారి చిన్నారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### తిరుపతి జిల్లాలో 16వ ఫైనాన్స్ కమిషన్

# విస్తృత పర్యటనలు



సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లాలో రెండు రోజుల పాటు 16వ ఫైనాన్స్ కమిషన్ విస్తృత పర్యటలు చేశారు. కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా, ఆయనతో పాటు 15 మంది సభ్యులతో కూడిన బృందం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానకి, అక్కడి నుంచి తాజ్ హోటల్ చేరుకున్నారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు అర్బన్ స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌లో కలిసి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్, బృందం సభ్యులు, డెలిగేట్స్‌కు రిసీవింగ్, ప్రోటోకాల్స్ అంశాలను జాగ్రత్తగా విధులు కేటాయించబడిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వర్చువల్ సమావేశంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఆర్డీవో తిరుపతి రామ్మోహన్, శ్రీకాళహస్తి భానుప్రకాష్‌రెడ్డి, లైజన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### చౌడేపల్లిలో ముగిసిన

# గంగజాతర

### -అలరించిన కళ్యాణోత్సవం



చౌడేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రంగుల రాట్నమాడుతున్న చిన్నారులు...సామాజిక కార్యక్రమాలో యువకులు...చుట్టాలు..ఆత్మీయులతో పెద్దలు...ఈ విధంగా పట్టణ ప్రజలు తీరికలేకుండా కనిపించారు. గంగజాతర సందర్భంగా పట్టణంలోని వీధులు, రోడ్లు కిక్కిరిసిపోయాయి. చౌడేపల్లి గంగజాతరకు రాష్ట్రంలోనే ఓ వైవిధ్యమైన చరిత్ర వుంది. సాధారణంగా గంగమ్మను ఓ చోటవుంచి పూజలు చేస్తారు. అయితే ఇక్కడ గంగమ్మకు పుట్టినిళ్ళు, మెట్టినిళ్ళు రెండూవున్నాయి. ప్రత్యేకించి అమ్మవారికి కళ్యాణోత్సవం జరుగుతుంది. మ ంగళవారం రాత్రి కుమ్మరివీధిలో వెంకట్రమణ(కుమ్మరి) పెద్దగంగమ్మను పెళ్ళికుమార్తెగా తీర్చిదిద్దారు. అనంతరం ఇక్కడి నుంచి ఆసాదివాని తిట్లు, మేళతాళాలు, బాణా సంచాలతో అమ్మవారిని చాకలి వీధికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అంతకు ముందే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్థలంలో పట్టణంలోని ప్రజల సమక్ష్యంలో మడవలి రాజు గంగమ్మను పెళ్ళాడాడు. సాధారణంగా ఈ తంతు ఏ గంగజాతరలోను ఉండదు. వివాహమయిన తర్వాత పెద్దగంగమ్మను నడివీధిలోకి తెచ్చి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున బెస్తవారి ఇంటి నుంచి ఘట్టమకుండ అమ్మవారికి చెలించిన తర్వాత గంగమ్మను భక్తుల సందర్శనార్థం ఉంచారు. గ్రామదేవతకు పట్టణ మహిళలచే నిర్వహించబడిన పిండితో దీపారాధన జాతరలో హైలెట్‌గా నిలచింది. రాత్రంతా జాగరణవుండి దీపాలు తయారు చేసుకొని మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నాలుగు దిక్కుల్లోని మారెమ్మ, నల్లగుంటి గంగమ్మ, బోయకొండ గంగమ్మ, సంతగేటు గంగమ్మలు, గ్రామదేవత చౌడేశ్వరీ అమ్మవార్లను ఆరాధించారు. అర్థరా త్రి నుంచి మహిళలు దీపారధనకు తరలివస్తుండటంతో వీధులన్నీ దీపాలతో

# స్వర్ణరథంపై అలరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన గణనాథుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మం డపంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాథుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున ్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార ్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు,

## బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్‌గా భాస్కర్‌నాయుడు నియామకం

తవణంపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



బంగారుపాళ్యం వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మండలంలోని కొండ్రాజుకాల్వ గ్రామ పంచాయతీ ఒడ్డు పల్లెకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు కర్రియావుల భాస్కర్ నాయుడును నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దశల వారిగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది. ఈనేపథ్యంలో బుధవారం రాష్ట్రంలోని 30 ఏఎంసీ ఛైర్మన్ పదవులను భర్తీ చేస్తూ ఉత్వ ర్తులు జారీ చేసింది. ఈమేరకు బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్‌గా మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ కర్రియావుల భాస్కర్‌నాయుడును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్వర్వులు జారీ చేసింది. మండలంలో సీనియర్ టీడీపీ నాయకులు, వివాద రహితుడు, సౌమ్యుడు అయిన భాస్కర్‌నాయుడును ఈపదవి వరించడంతో మండలంలోని టీడీపీ శ్రేణులు హర్ ్షం వ్యక్తం చేస్తున్నారు.

## చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్‌గా గౌస్ బాషా

చంద్రగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



చంద్రగిరి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా స్థానిక కొత్తపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయ కుడు, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్‌గౌస్ బాషాను నియమించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏ పులివర్తి నాని సహకారంతో తనకు లభించిన పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎంఎల్ఏ సహకారంతో రైతులకు నాణమైన సేవలు అందించడంతో పాటు వారికి నిత్యం అందుబాటులో వుంటానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## వసూళ్ళకు పాల్పడితే సహించను

### బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తన పేరును ఉపయోగించి కొందరు వ్యక్తులు,అలాగే తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాధికారి సొమ్ములు వసూలు చేస్తూ తనను అభాసుపాల్జేస్తున్నారని శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి బుధవారం శివమెత్తారు.శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తి,తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విచ్చల విడిగా వసూళ్ళు చోటు చేసుకున్నాయి. అయితే ఈ సారి సాక్షాత్తు శాసనసభ్యుని పేరుతోనే వసూళ్ళు చేస్తున్నట్లు ఆయనే హెచ్చరించటం గమనించదగ్గ విషయం. వివరాలు పరిశీలిస్తే జనార్ధన్‌రెడ్డి అనే రైతు తనకున్న పొలాన్ని మార్ట్‌గేజ్ చేసి రద్దుకోసం 20 రోజులుగా తిరుగుతున్నట్లు తెలిసింది. అయితే ఇందుకు సంబంధిత గుమాస్తాకు రూ.3600లు లంచం ఇచ్చినట్లు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డికి ఫిర్యాదు చేసారు. అందుబాటులో ఉన్న శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి 15 నిముషాల్లో తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న జనార్ధన్‌రెడ్డి ఎంఎల్‌ఏ తెలుగు దేశం కార్యకర్తల సమక్షంలో తన సమస్యను తాను ఇచ్చిన లంచాన్ని, అంతేకాక పనిచేయక పోగా ఇంకా లంచం అడుగుతున్నారని ఆవేశంగా వివరించారు.దాంతో ఎంఎల్‌ఏ సుధీర్‌ంరెడ్డి సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్‌ను నిలదీసారు. ఇదో వసూళ్ళ కేంద్రంగా మారిందని ధ్వజమెత్తారు. నా పేరు కూడా చెప్పి వసూళ్ళు చేస్తున్నట్లు పిర్యాదులందుతున్నాయని శివమెత్తారు.

# యద్దేచ్ఛగా కలప అక్రమ రవాణా!

### కమీషన్ మత్తులో పట్టించుకోని పుత్తూరు అటవీశాఖ అధికారులు

నారాయణవనం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :



వృక్ష సంపదను ఎట్టి పరిస్థితిల్లోను అనుమతి లేకుండా కటింగ్ చేయడం నేరమని చట్టాలు చెబుతున్నప్పటికి వ్యాపారులు మాత్రం చట్టాన్ని తమ చుట్టంగా మలుచుకొని యద్దేచ్ఛగా కలపను రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఎక్కడ గానీ చెట్లను నరకవద్దని చట్టాలు తెస్తున్నప్పటికి పట్టించుకొనే నాథుడు కరువయ్యారు. మండలంలో గత కొన్నేళ్లుగా వృక్ష సంపద(కలప)ను ఎలాంటి అనుమతి లేకుండా స్థానికంగాను, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికి అడ్డుకోవాల్సిన పుత్తూరు అటవీశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వాల్టా చట్టం ప్రకారం చెట్లను నరికివేయడం నేరం. అయినా వ్యాపారులు, ఇటుక బట్టీ వ్యాపారం చేసే వ్యక్తులు పొలాల్లో, అడువుల్లో పెరిగిన తైలం, వేప, చింతచెట్లుతో మిగిలిన ఎన్నో రకాలైనటువంటి విలువలను వృక్షాలను నరికి తీసుకెళ్తూతున్నారు. పొలాల్లో రైతులు పెంచుకున్న చెట్లను నరకడానికి కూడా తప్పకుండా ప్రభుత్వ అనుమతి తప్పని సరి. అయినా ఎలాంటి అనుమతిని తీసుకోకుండా కొనుగోళు చేసిన రైతులు కటింగ్ చేసి తరలిస్తున్నారు. క్రింది స్థాయిలో ఎవరైనా ప్రశ్నిస్తే కమీషన్ కొట్టి కలపను తీసుకెళ్లిపోతున్నారు. అంతేకాకుండా అడవుల్లోకి కూలీ మనుషులను తీసుకెళ్లి కలపను కొట్టి తీసుకెళ్తున్నారు. ఇక ౖడ నుంచి తరలించే కలపను పుత్తూరు, నగరితో పాటు ఇటుక బట్టీ వ్యాపారులకు తరలిస్తున్నారు. రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోళు చేసిన కలపను మూడింతల ఆదాయానికి అమ్ముకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కలప అక్రమ రవాణాన్ని అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులే అక్రమాలకు పాల్పడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### అభ్యంతరం లేని ఇళ్ళు

# క్రమబద్దీకరణ

### జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త ః నివాసం కోసం పేదలు ఆక్రమించుకుని ఇళ్ళు నిర్మించుకున్న అభ్యతరం లేని ప్రభుత్వ భూముల్లోని వాటిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు మీడియాతో జిల్లా కలెక్టర్ జేసీ శుభం బన్సల్‌తో కలిసి మాట్లాడారు. ఆక్షేపణలేని ప్రభుత్వ భూముల్లో ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారు ఎవ రైనా ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరించి సంబంధిత దరఖాస్తు దాడికి ఇంటి పట్టాను మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ పథకం 150 చదరపు గజాలు (స్క్వేర్ యార్డ్స్ )లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి ఇంటి పట్టా మంజూరు చేస్తుందన్నారు. 2019 అక్టోబరు 15తేదిని కట్ ఆఫ్ డేట్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలు వారి దగ్గర ఉన్న ఆధారాల్లో ఏదో ఒకటి చూపి పట్టాలను తీసుకోవచ్చునన్నారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించడం జరిగిందని తెలిపారు. సీఎఫ్ఎమ్ఎస్‌లో ఫీజులు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ క్రమబద్ధీకరణ పథకం 2025 ఒక మంచి సదవకాశమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# జాతరకు పటిష్టమైన ఏర్పాట్లు

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త ః

మే 6 తేది నుంచి 14వ తేది వరకు శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించేలా సంబంధిత శాఖల విభాగాలు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవి మనోహరాచారి సంబంధిత శాఖల అధికారులతో కలిసి తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీతాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం



కోసం వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వారికి మంచి అనుభూతి కలిగేలా దర్శనం సౌకర్యం కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా సంబంధిత శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూం, క్యూలైన్లు, పార్కింగ్, పోలీస్ బందోబస్తు, త్రాగునీరు, విద్యుత్, మెడికల్ క్యాంపులు లాంటి తదితర అంశాలపై ప్రణాళిక బద్ధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, అడిష నల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవి మనోహరాచారి, శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయ ఈవో జయకుమార్, జిల్లా దేవాదాయ శాఖాధికారి వెంకటకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రామయ్య, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యువ ఆన్వేష్, విద్యుత్‌శాఖ ఈఈ చంద్రశేఖర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

### గంగమ్మ జాతర ఉత్సవాల వివరాలు

*మే 6 మంగళవారం చాటింపు, 7వ తేది బుధవారం బైరాగివేషం, 8వ తేది గురువారం బండవేషం, 9వ తేది శుక్రవారం తోటివేషం, 10వ తేది శనివారం దొరవేషం, 11వ తేది ఆదివారం మాతంగి వేషం, 12వ తేది సోమవారం సున్నపు కుండలు, 13వ తేది మంగళవారం గంగమ్మ జాతర సప్పరం, మే 14వ తేది బుధవారం విశ్వరూప దర్శనం*

## కెసి ఆస్పత్రిచే వీల్ ఛైయిర్ పంపిణీ

కుప్పంరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్న వేణు అనే బాలుడికి 18వేల విలువ చేసే వీల్ ఛెయిర్‌ను కెసి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ మంజునాథ్, డా॥ బాలాజీ, డా॥ చైతన్యలు అందించారు. ఈవీల్ చెయిర్‌ను కుప్పం లయన్స్‌క్లబ్ ద్వారా బాధితుడికి అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, అధ్యక్షుడు సోమశేఖర్, సభ్యులు సెల్వం, వెంకటస్వామి, నబి, బాబు, హరి పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా సాగాలి



– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల.. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ఎం

శాంతిపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకుసాగాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. బుధవారం మండలంలోని శెట్టిపల్లి హైస్కూల్‌లో మాతృభాషలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలనుపంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకు చర్యలు చేపడుతున్నారన్నారు. పిల్లలు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు ఉదయ్‌కుమార్, నాగరాజు, రమేష్, మణి, చంద్ర, గోపాల్, శ్యామలమ్మ, సరిత, హెచ్ఎం తీగల వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలోనే గోశాలల్లో ఘోరాలు : గౌనివారి

శాంతిపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



వైకాపా పాలనలోనే టిటిడి గోశాలల్లో ఘోరాలు జరిగాయని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి మూగజీవాల ప్రాణాలు తీసుకున్నారన్నారు. టిటిడి ప్రక్షాళనలో తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోనని భయంతో వైకాపా నేతలు ముందుగానే రోడ్డెక్కి తమ ప్రభుత్వంపై నిందలు వేయడం దారుణమన్నారు. వైకాపా పాలనలో దళారులతో దందాలు చేశారన్నారు. టిటిడిలో నెయ్యిని కల్తీ చేశారన్నారు. కూటమి పాలనలో టిటిడి గోశాలలు సక్రమంగా పనిచేస్తున్నాయన్నారు.

## అట్టహాసంగా ఎంపిపి..వైస్‌ఎంపిపిల ప్రమాణస్వీకారం

*రామకుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త* రామకుప్పం మండల ఎంపిపిగా సులోచన, వైస్ ఎంపిపిగా వెంకట్రామ గౌడు బుధవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సిఎం పిఎ మనోహర్ తదితరులు హాజరై వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికై కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకువస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు మునసా ్వమి, పట్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, చలపతి, చిన్నికృష్ణ, సీతాపతి, గంట్లగౌడు, నందారెడ్డి, రఫీ, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రికి అవసరమైన వసతులు, పరికరాల గురించి వివరాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.



## పట్టుపురుగుల చాకీ సెంటర్ ఏర్పాటు రైతులకు వరం

శాంతిపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



పట్టుపురుగుల చాకీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం రైతులకు వరమని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని కోతిగుట్లపల్లి గ్రామంలో వెంకటాద్రినాయుడు ఏర్పాటుచేసిన చాకీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. గతంలో రైతులు పట్టుపురుగుల కోసం కర్ణాటకకు వెళ్లేవారని ప్రస్తుతం రైతులకు అందుబాటులో తేవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టుశాఖ ఎడి, నేతలు వెంకటాద్రినాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, హరినాథరెడ్డి, బుజ్జినాయుడు, శివశ ంకర్‌నాయుడు, సుకుమార్ పాల్గొన్నారు. అనంతరం రైతులకు పట్టుపురుగులు పంపిణీ చేశారు.

## 19న మెగా ఉద్యోగ మేళా

*చిత్తూరురూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:* చిత్తూరు నగరంలోని పివికెయస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఈనెల 19 ఉదయం 10గంటలకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా మెగా ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.పి. జీవనజ్యోతి తెలిపారు. ఈమెగా మేళాలో దాదాపు 20 కంపెనీలు పాల్గొననున్నట్లు, 1000కు పైగా ఉద్యోగవకాశాలు వున్నాయనీ, 18–35 సంవత్సరాల వయస్సు కలిగి ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బిటెక్, బిఫార్మసి, ఎంబిఏ చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పని సరి అని, ఆసక్తి కలిగిన విద్యార్థులు http://naipunyam.ap.gov.in/user-registration లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని అలాంట్‌మెంట్ స్లిప్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ఎన్‌విఎస్ నారాయణరావు (9985442270), కమాండ్ కంట్రోల్ నెం. 9988853335, 8712655686లను సంప్రదించాలని కోరారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం

– ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

పాలసముద్రం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కారం చూపాలని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అధికారులను ఆదేశించారు. పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. స్థానికంగా పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడికక్కడే ఎమ్మెల్యే అధికారులతో చర్చించి పరిష్కరించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్ళి న్యాయం చేసి రావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కన్వీనర్ డాక్టర్ యుగంధర్ పొన్నా, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజేంద్ర, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వాసునాయుడు, తహసిల్దారు అరుణకుమారి, ఎంపిడిఓ విద్యావతి, ఎస్ఐ చిన్నపరెడ్డి, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాట ఇచ్చాము...! మంచినీరు అందించాం...!



– పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట ఇచ్చాము. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు మంచినీరు అందించామని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం రాగిమానుపెంట దళితవాడలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితవాడ ప్రజలు ఎన్నికల ప్రచార సమయంలో మంచినీటి ట్యాంకు నిర్మించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం దళితవాడ ప్రజలకు మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం 27 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, ఆ నిధులతో ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి నూతనంగా ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. బంగారుపాళ్యం–రాగిమానుపెంట బిటి రోడ్డు, ఏనుగుల నుండి పంట రక్షణ కోసం కందకాల తవ్వకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్, కార్యదర్శి జనార్ధన్‌గౌడు, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి కోదండయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, సర్పంచ్ తోట శ్రీహరి, టిడిపి నాయకులు బాలకృష్ణమనాయుడు, కోకా ప్రకాష్, నాగరాజునాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమేష్, లోకనాథంనాయుడు, హేమచంద్ర, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌పురం అభివృద్ధే ధ్యేయం



ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

ఎస్ఆర్ పురం మండలంను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి కృషి చేస్తానని ప్రభుత్వవిప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. మండల పరిధిలోని 52 కనికాపురం గ్రామంలో 74 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డును బుధవారం ప్రభుత్వ విప్ థామస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిటి రోడ్డు నిర్మాణానికి సిఎం నారా చంద్రబాబునాయుడు అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. ఎక్కువ సిమెంటు రోడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే జంగాలపల్లి–తిరుపతి బస్సు సర్వీసు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వచ్చేలా చేయాలని ప్రజలు విన్నవించగా పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ప్రభుత్వ విప్ ఫోన్‌లో సంప్రదించి సమస్యను పరిష్కరించారు. ముస్లీం షాదీమహల్ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ముస్లీంలు కోరడంతో కలెక్టర్‌తో చర్చించి షాదీమహల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే కనికాపురం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ యుగంధర్‌పొన్నా, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్ర, మండల దేశం అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, నాయకులు గంధమేని రాజశేఖర్‌నాయుడు, నిరంజన్‌రెడ్డి, సూరిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కుమార్, జలంధర్‌నాయుడు, హిమాచలపతిరెడ్డి, తహసిల్దారు లోకనాధపిళ్ళై, ఎంపిడిఓ మోహన్ మురళీ, కార్వేటినగరం ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



*పలమనేరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:* నియోజకవర్గంలో టిడిపి నాయకులు వర్గ పోరును మానుకుని ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం నియోజకవర్గ యూనిట్ క్లస్టర్ మరియు బూత్ ఇంచార్జిలు, ముఖ్య నేతలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందడంలో నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. వర్గపోరు మాని పార్టీలకు అతీతంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరడానికి కృషి చేయాలని తెలిపారు. మండలంలో తాగు నీటి సమస్య ఎక్కడ ఉన్నా తక్షణం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రధానంగా పార్టీకి సంబంధించిన కుటుంబ సాధికారిక సారధి, గ్రామ స్థాయి మొదలు పార్లమెంటు, అనుబంధ కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, రంగనాథ్, నాగరాజు రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు తగు చర్యలు

– కడ పి.డి. వికాస్ మర్మత్



*కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త* గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి రెండో వార్డులో ఉన్న చీగలపల్లి, నారాయణపురం, హనుమంత కొటాలు, మంగాపురం, పెద్దన్న కొటాలు తదితర గ్రామాల్లో పి.డి. పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల సమస్యలపై ప్రజలకు పి.డి.కి వివరించారు. అనంతరం పాఠశాలల ఆట స్థలాలు, ప్రహరీగోడ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారంకై చేపట్టాల్సిన పనులపై తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ ఎఇ ఆంజనేయులును ఆదేశించారు. అనంతరం నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడుపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



ప్రజలు అగ్నిప్రమాదాల పట్లఅప్రమత్తంగా ఉండాలని కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం బెగిలపల్లి పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో ప్రజలకు అగ్ని ప్రమాదాలు, గ్యాస్ సంబంధిత ప్రమాదాలను వివరించి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంచారు. సిబ్బంది మోహన్, జయకుమార్, కృష్ణయ్య, రఘుపతి, నరేష్, రామూర్తి, మణి, విజయ పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌చే కుప్పం విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



*కుప్పంరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త* ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థినులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ షైనింగ్ స్టార్ 2025 పురస్కారాలు అందించారు. కుప్పం ప్రభుత్వ ఒకేషనల్ కాలేజ్‌లో ఎఇ గ్రూప్ చదువుతున్న సుస్మిత (976), ఫిజియోథెరపీ చదువుతున్న శ్రీనివాసులు (952)లు మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వీరికి బంగారుపతకాలతో పాటు ల్యాప్‌టాప్‌లను మంత్రి లోకేష్ బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సయ్యద్ మౌలీ, ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, ఎజిఎంఆ జగదీష్‌బాబు, అధ్యాపకులు ఫక్రుద్దీన్, రిజ్వానుల్లా, షహీన్ తాజ్, అనిల్, రోజా, అర్చన పాల్గొన్నారు. అలాగే నడిమూరు ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన అశ్విని (969)సైతం మంత్రి లోకేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిణి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అభిమాని అమ్మ కోసం...!



-అన్నం వడ్డించిన చల్లా బాబు

చౌడేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పెద్దలు మరణిస్తే వారి ఆస్తుల కోసం తగువులాడే బిడ్డలను మనం చూస్తున్నాం...అయితే అమ్మ చెప్పిందని వేలాది మందికి అన్నం పెడుతున్నాడా యువకుడు...యేటా జాతరలో అందరినీ పిలిచి మరీ కడుపు నిండా అన్నంపెట్టేదా మాతృమూర్తి...ఆమె తనువు చాలించిన తర్వాత ఆ బాధ్యతను కుమారుడు రెడ్డిప్రసాద్ చేపట్టాడు. అతని ఇంటి పేరు ' భోజనాల 'ను సార్థకం చేసుకొంటున్నాడతను...పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జ్ చల్లా బాబు జాతరలో ఉచిత అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. తేదేపా నాయకుడు మాదిరాజు ప్రదీప్‌రాజు, లక్ష్మణరాజు(పతిరాజు), విద్యాసాగర్, కార్తీక్, సాయికృష్ణ, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

## శుద్ధజల యంత్రాన్ని ప్రారంభించిన చల్లా బాబు

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త



ప్రముఖశక్తిక్షేత్రంబోయకొండలోదాత సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధజల యంత్రాన్ని పుంగ నూరు తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా బాబు ప్రారంభిం చారు. రణభేరీ గంగమ్మ ఆలయం నుంచి రాజగో పురం వద్ద విజయవాడ సామినిరెడ్డి శుద్ధజలయంత్రా నికి రూ. 6.50లక్షల విరాళంగా అందించారు. ఈ ప్లాంట్‌ను చల్లా బాబు భక్తులకు అంకితం చేసారు. విశేష సంఖ్యలో కొండకు తరలివచ్చే యాత్రీకుల సేవకు దాతలు ముందుకు రావడం శుభ పరిణామమని ఆయన అన్నారు. తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు పతిరాజు, ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, తేదేపా నాయకులు జన్నే సుబ్రమణ్యం, సోము, శివప్ప, రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, దేవస్థానంఅధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్తూరులో ప్రజాదర్బార్ !

చిత్తూరు టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయంలో బుధవారం "ప్రజాదర్బార్" కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు నగర మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 72 ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి సమస్యపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకేశ్వరీ, ఎంహెచ్వో డా. లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



చిత్తూరు నగరంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం తనిఖీ చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించి సిసి కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. అలాగే సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్ళలో వున్న సిసి కెమెరాల దృశ్యాలను స్వయంగా పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సమయంలో ఎస్ఓఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్ఓఎస్ సంకేతం అందగానే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం చేరి మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ సూచించారు. అలాగే డయల్ 112 విభాగంను పరిశీలించిన ఎస్పీ ఇది ప్రజలకు అత్యవసర పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలను అందించే అత్యంత కీలక నెంబర్ అన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎస్ఐ సహదేవి, కమ్యూనికేషన్ ఎస్ఐ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

## మారియమ్మన్ మహాకుంబాభిషేకం ఉత్సవంలో ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



మండల పరిధిలోని గొల్లమడుగు పంచాయతీ చింతగుంటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత మారియమ్మ మహాకుంభాభిషేకం కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. ఆలయ పూజారులు, గ్రామస్తులు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మారియమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవత మారియమ్మ ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, కూటమి పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## విఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలంటు నిరసన

పలమనేరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:



పలమనేరు మండలం విఆర్ఏల సమస్యలను పరిష్కరిం చాలంటు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద పలమనేరు విఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విఆర్ఏలకు కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలని, పి.ఎస్.ఇఎస్ఐల సౌకర్యం కల్పించాలని, రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న విఆర్ఓ, అటెండర్లు, మాచ్‌మ్యాన్‌లు, రికార్డు అసిస్టెంట్‌లు, డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం జిల్లా నాయకులు ఓబుల్‌రాజు, విఆర్ఏలు దేవేంద్ర, హరి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లుకు వైకాపా మద్దతుపై ముస్లీంల ర్యాలీ

చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



వక్ఫ్ బిల్లుపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంపై చిత్తూరు నగర ముస్లీంలు బుధవారం మాజీ సిఎం, వైకాపా రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లీంలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు సవరణ పేరిట ముస్లీంలకు అన్యాయం చేసిందన్నారు. వక్ఫ్ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో వ్యతిరేకించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతరం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో న్యాయ పోరాటానికి సిద్ధం కావడం హర్షనీయమన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి ముస్లీంలకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం నాయకులు మున్నా, షరీఫ్, గౌస్, ఖాదర్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు అనైతికం

.తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



అటు ప్రజల్లో కానీ, ఇటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో కానీ చంద్రబాబుగారిపై వ్యతిరేకత తీసుకురావాలన్న కుట్రతో టిటిడి మాజీ ఛైర్మన్, తిరుపతి మాజీ ఎంఎల్ఏ భూమనకరుణాకర్‌రెడ్డి అనైతిక ఆరోపణలకు పాల్పడుతున్నారని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. పలువురు బిసి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మత పరమైన కుల పరమైన వైషమ్యాలు రెచ్చగొట్టే మనుషుల మధ్య ఘర్షణలు సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తున్న టిటిడి మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి కరడుకట్టిన హిందూవ్యతిరేఖి అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిటిడిలో అన్ని విభాగాలను ప్రక్షాళన చేసి, భ్రష్టుపట్టిన గోశాలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్ది లోపాలను సరిచేయడానికి చర్యలు చేపట్టింది చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు టిటిడి, ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లడం ప్రారంభించాయని ఆరోపించారు. కార్యక్రమంలో మిన్నల్‌రవి, ఉమేష్‌రావు, నెమళ్ళూరుబుజ్జి, మునిరాజయాదవ్, కోటచంద్రశేఖర్, సునీల్, భాస్కర్, మణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మను దర్శించుకున్న రిషితారెడ్డి

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారిని బుధవారం ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పూజారి పరమేశ్వరయ్య ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి నిలువెత్తు విగ్రహానికి బంగారుచీరల అలంకరణతో ఉండడంతో దర్శించుకున్నారు. అనంతరం ఆమెను రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి కండువాతో సత్కరించారు. అనంతరం ఆలయంలో వేసిన ముగ్గును పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లలో తెలుగుదేశం మహిళలు రేణుకాదేవి, మల్లీశ్వరి, చిన్న అలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూలుగంటి గోపి కుటుంబసభ్యులకు పరామర్శ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణ ప్రముఖులు జూలుగంటి గోపి తల్లి జూలుగంటి ప్రేమకుమారి ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. దీంతో బుధవారం మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి, మాజీ దేవస్థానం ఛైర్మన్ అంజూరుశ్రీనివాలు వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. తాము కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణ కుమార్, కంటా ఉదయ్‌కుమార్, కోవిచంద్రయ్యనాయడు, మున్నారాయల్, శ్రీవారి సురేష్, పఠాన్ ఫరీద్, కృష్ణయ్య, హరిరాయల్, గణేష్, మురళీయాదవ్, కిరణ్, రవి, కామివెంకటేశ్వర్లు, ఫజల్, వెంకటేశ్వర్లు, ఫజల్ జులేషా, పెరుమాల్ బావాజీ, నరేంద్ర, రాజేంద్ర, జీవికెరెడ్డి, విద్యార్ధి సంఘ అధ్యక్షుడు కార్తీక్, యాకూబ్, సతీష్, సూరి, దినేష్, సురేష్, గోవర్ధన్, దేవ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

.తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమం సందర్భంగా మండలంలోని జ్ఞానాంబ కండ్రిగలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రామిన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతాయని బిడ్డపుట్టి రెండు సంవత్సరాలు నిండే వరకు వారి సంరక్షణ పట్ల గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, రేవతి, గీత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏచే నూతన అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు

.తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో నూతన అంగన్‌వాడీ కార్యకర్తలకు మరియు సహాయకులు నియామకమైన వారిని నిజాయితీగా గ్రామంలో గర్భిణీ, బాలింతలు, తల్లిదండ్రులకు సేవలు అందించాలని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వారికి సూచించారు. నూతనంగా నియామకపత్రాలు అందుకున్న వారిలో తొట్టంబేడు మండలంలో ఇద్దరు, మున్సిపాలిటీలో ఇద్దరు, శ్రీకాళహస్తి మండలంలో ఇద్దరు, రేణిగుంటలో ఇద్దరు, ఏర్పేడులో నలుగురుకి నూతనంగా నియామపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

.తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



అగ్ని ప్రమాద వారోత్సవాల సందర్భంగా మూడోరోజు చెంచు లక్ష్మి కాలనీలోనివాసం ఉంటున్న ప్రజలకు కరపత్రాలు పంపిణీచేశారు. గ్యాస్‌ఫైర్ మరియు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవించినపుడు ఎలాంటి నివారణ చర్యలుతీసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం గ్యాస్ లీకేజీలు సంబంధించి మంటలు చెలరేగినపుడు వాటిని ఎలా ఆపాలో సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఫైర్ ఆఫీసర్ పి.నాగార్జునరెడ్డి, మరియు కేంద్ర సిబ్బంది పి.తిరుమలరెడ్డి, ధనశేఖర్, మునిశేఖర్, రంజిత్‌కుమార్, విజయకుమార్ పాల్గొన్నారు.

## సి.గొల్లపల్లిలో వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



తిరుపతిరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లి గ్రామంలో శ్రీరామ పట్టాభిషేకం కన్నుల పండుగగా నిర్వహించారు. గత పదిరోజుల పాటు గ్రామంలో శ్రీరాముని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరిరోజున ఆలయ ప్రాంగణంలో రాముని పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిగురువాడలో పులివర్తి సుధారెడ్డికి ఘన స్వాగతం



తిరుపతిరూరల్, ఎప్రిల్16 ప్రభాతవార్త: మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డికి చిగురువాడ టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, చిగురువాడ టిడిపి నాయకులు వార్తాల శ్రీనివాసులు, వార్తాల శివ యాదవ్, మురళి, మహేశ్వరరెడ్డి, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం గోశాలకు విరాళం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది.ఈ నేపథ్యంలో బుధవారం మునగాల శ్రీధర్‌గుప్తా రూ.60వేల విరాళాన్ని ఆలయానికి అందించారు. శ్రీకాళహస్తీ శ్వరాలయంలో నిత్యాన్న ప్రసాదం,గోశాల నిర్వహణ చక్కగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో శ్రీధర్‌గుప్తా శ్రీకాళహస్తికి చెందిన మునగాల సతీష్‌గుప్తా,రత్నమ్మశెట్టి,మునిలక్ష్మమ్మశెట్టి పేర్లతో రూ.60వేల రూపాయలను ఆలయాధికారికి అందిస్తూ వీటిని గోశాలలో గోవుల నిర్వహణకు ఉపయోగించాలని కోరారు. వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనం,స్వామి అమ్మవార్ల తతీర్థ ప్రసాదాలను అందించారు.

## చల్లంగా చూడు ముత్యాలమ్మ తల్లి!

మాజీ ఎంఎల్ఏ మధుసూధనరెడ్డి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర సందర్భంగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనఅనుచరులతో కలసి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ మొక్కుకున్నారు.శ్రీకాళహస్తిని ఐదేళ్ళ పాటు పరిపాలించిన తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,స్వర్ణమూర్తి కంతాఉదయ్‌కుమార్, శ్రీవారి సురేష్, మున్నారాయల్, గణేష్, మురళీ యాదవ్,కిరణ్,అట్లరమేష్, మొద్దుముడిరవి,కామివెంకటేశ్వర్లు, జీవికే రెడ్డి, కార్తీక్, యాకూబ్, సతీష్, సూరి,దినేష్, గోవర్ధన్, దేవ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా ప్రతినిధిగా దుర్గ



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త శ్రీకాళహస్తి తెలుగుదేశం మీడియా ప్రతినిధిగా మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్‌ను నామినేట్ చేస్తూ శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రకటించారు.ఆది నుంచి పార్టీ విధేయుడుగా ఉంటూ ఎంఎల్ఏ ముఖ్య అనుచరుల్లో ఒకరుగా ఉన్న దుర్గా ప్రసాద్‌ను నామినేట్ చేసారు. మీడియా వారితో సన్నిహితంగా ఉన్న దుర్గా ప్రసాద్ పార్టీ కష్టకాలంలో కూడా శాసనసభ్యునితోనే మెలిగారు.

## మండల అభివృద్ధికి మంత్రులు సహకరించండి..!

టిడిపి సీనియర్ నాయకుడు భక్తవత్సలం నాయుడు



రామచంద్రాపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: రామచంద్రాపురం మండల అభివృద్ధికి రాష్ట్ర మంత్రులు సహకరించాలని కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పొడవకంటి భక్తవత్సలం నాయుడు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రులను మర్యాదపూర్వకంగా కలసి మండల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనుప్పలి ,, కమ్మకండ్రిగ గ్రామాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. రాయలచెరువు సమీపంలోని భవానీ శంకరాలయం వద్ద 108 అడుగుల శ్రీ ఆంజనేయస్వామి వారి విగ్రహం ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. రాయలచెరువు కట్ట నుండి అనుప్పల్లి వరకు ఆర్అండ్‌బి రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు.

## మంచినీటి సరఫరాపై పులివర్తి ప్రత్యేక చొరవ

మండల పరిషత్ నిధులు రూ.12.50 లక్షలు
టిడిపి నాయకుడు మంగాపురం భాస్కర్ రాయల్



చంద్రగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: చంద్రగిరి పాతపేటకు మంచినీటిని అందించేందుకు ఉద్దేశించిన పైప్ లైన్ పనులకు ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు టిడిపి నాయకుడు మంగాపురం భాస్కర్ రాయల్ అన్నారు. స్థానిక లైబ్రరీ సర్కిల్ వద్ద బుధవారం బిడీ కాలనీ నుండి పాతపేటకు మంచినీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణ పనులకు ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, టిడిపి నాయకుడు ముద్దికుప్పం రామమూర్తి, మంగాపురం లోకేశ్వరి భాస్కర్ రాయల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవికుమార్‌తో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పనులను చేపట్టిన భాస్కర్ మాట్లాడుతూ చంద్రగిరి ప్రజలు మంచినీటి సమస్యతో బాధపడకుండా ఎంఎల్ఏ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులకు ఎంఎల్ఏ మండల పరిషత్ నిధులు రూ.12.50 లక్షలు మంజూరు చేయించడంతో పైప్ లైన్ పనులు చేపట్టినట్లు వివరించారు. బిడి కాలనీ, వికలాంగుల కాలనీ, అక్కగార్ల కాలనీ, జోగుల కాలనీ, పాతపేటకు ఈ పైప్ లైన్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

## భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వేల గ్రామసభలు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: రైతులు దీర్ఘకాలికంగా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వేగ్రామ సభలను నిర్వహిస్తుందని రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని చిన్నయ్యగుంట భూముల రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో రైతులను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని ఈ అవకాశం ఆ గ్రామ పంచాయతీ రెవెన్యూలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ మించల నల్లయ్య, సర్వేయర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## ఓటీఎస్ వెలుగు రుణాలను దుర్వినియోగంపై ఎంపీడీవోకు ఫిర్యాదు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: వెలుగు సమాఖ్య సంఘాల ద్వారా పూసలపల్లి సంఘాల ఓటీఎస్ వెలుగు రుణాలను దుర్వినియోగంపై ఎంపీడీవో త్రివిక్రమరావుకు సంఘ సభ్యులు సంఘమిత్రలు, సీసీలపై ఫిర్యాదు చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ పొదుపు రుణాలు పొందేందుకు బ్యాంకు అధికారులను సంప్రదించగా రుణ బాకీ ఉందని సూచించారు. అనుమానం వచ్చి గ్రూపు సభ్యులతో చర్చించి విచారించగా ఓటీఎస్ రుణాలు ఎవరు పొందలేదని తెలిసింది. 2022లో చెంగాలమ్మ, సాయిబాబా, భాగ్యలక్ష్మి, గంగాదేవి గ్రూపుల్లో 9 మంది సభ్యులు ఓటీఎస్ రుణాలు పొందినట్టు నమోదైంది. ఈ రుణాలకు గ్రూప్ సభ్యులకు ఎటువంటి సంబంధం లేదు. గతంలో పని చేసిన సీసీలు సంఘమిత్ర చేతివాటం ప్రదర్శించి ఓటీఎస్ రుణాలను దుర్వినియోగం చేశారని తెలిపారు. వెలుగు సమాఖ్య అధికారి, ఎంపీడీవో, బ్యాంకు అధికారులు పూర్తి దర్యాప్తు చేపట్టినిధులు దుర్వినియోగం చేసిన సంఘమిత్ర సీసీలపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

## ఎస్ వి ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య, ఏప్రిల్ 16 ప్రభాతవార్త శ్రీ సత్యసాయి సేవా సమితి వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో కాలేజీ విద్యార్థులు విశేష ప్రతిభ చాటారు.తెలుగు లో కే శరత్ ప్రథమ బహుమతి,హసన్ వలి ద్వితీయ బహుమతి, అభిషేక్ తృతీయ బహుమతి,ఇంగ్లీష్ లో సాయి అఖిల్ ప్రథమ బహుమతి,జగదీశ్వర్ రెడ్డి కంసోలేషన్ బహుమతి పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి,అధ్యాపకులు అభినందించారు.

## వైభవంగా సంకటహర చతుర్థి



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో సంకటహర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న సూర్యభగవానుడికి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గణపతి హోమం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## గ్రామసభలో ఆద్యంతం రచ్చ రచ్చే....



రేణిగుంట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన కార్యదర్శి మణి సమక్షంలో జరిగిన గ్రామసభ రచ్చ రచ్చగా ముగిసింది. వివిధ పార్టీల నాయకులు అనేక ప్రశ్నలతో సభలో అధికారులను నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముఖ్యంగా వేలం పాటల డబ్బులు జమ చేయడంపై గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వలేకపోయారు. రేణిగుంట కూరగాయల మార్కెట్ లోపలి అంగళ్లను తొలగించి నూతన అంగళ్లను నిర్మించాలని ప్రజలు కోరారు. దినసరి మార్కెట్ కూరగాయల మార్కెట్, సంతలో వసూళ్లపై ధరల పట్టిక పెట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రశ్నలకు కార్యదర్శి సమాధానం ఇస్తూ ధరల పట్టిక నిర్ణయించామని అందుకు సంబంధించిన బోర్డు గుత్తేదారుల ద్వారా సంతలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేలంపాటల డబ్బులు గుత్తేదారులు 20 చెల్లించారని, మిగిలిన డబ్బులు చెల్లించడానికి సమయం ఇవ్వాల్సిందిగా గుత్తేదారులు కలెక్టర్కు అర్జీ పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ సభలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్, జనసేన నాయకులు నగరం భాస్కర్ బాబు, టిడిపి యువ నాయకులు వార్డ్ మెంబర్ ఎం జి రెడ్డి పాల్గొన్నారు.

## ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య హవా...



రేణిగుంట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలిపియాడ్ (ఐ.ఎన్.టి.ఎస్. ఓ)లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనపరచి అందరి మన్ననలు పొందుతున్నారు. రేణిగుంట చైతన్య పాఠశాలలు చెందిన 144 మంది విద్యార్థులు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు, 182 మంది విద్యార్థులు కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. ప్రత్యేక బహుమతులు ఏడు మంది విద్యార్థుల సొంతమయ్యాయి. మొదటి బహుమతులు దక్కించుకున్న ఎనిమిదో తరగతి విద్యార్థి శశికిరణ్, నాలుగో తరగతి విద్యార్థి శ్రీనివాస్ హర్షిత్ లకు జిల్లా విద్యాధికారి వెంకటనాగేంద్ర కుమార్ చేతులు మీదుగా ట్యాబ్లు, మెడల్స్, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉత్తమ బహుమతులు అందుకున్న విద్యార్థులను పాఠశాల ఏజీఎం సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ చారుమతి, డీన్ గోవర్ధన్, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో తిరిగి ప్రారంభమైన బస్ సర్వీస్...



రేణిగుంట ఏప్రిల్ 17 ప్రభాత వార్త ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో రేణిగుంట మండలం శ్రీనివాస ఉదాస పురం గ్రామం నుండి తిరుపతికి ఆర్టీసీ బస్సును టిడిపి నాయకులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. బస్సు సౌకర్యం లేక ఆ ప్రాంతవాసులు పడుతున్న ఇక్కట్లను టిడిపి నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆర్టీసీ అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బస్సులు తిరిగి ప్రారంభించడానికి ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. ఎట్టకేలకు గత ప్రభుత్వంలో నిలిచిపోయిన బస్సు సర్వీసు మరల ప్రారంభమైంది. దీంతో ఆ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఆర్టిసి డిపో మేనేజర్, ట్రాఫిక్ సూపర్వైజర్ లతోపాటు రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి, టిడిపి జిల్లా నాయకులు మునుస్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు రామస్వామి, సుధాకర్ నాయుడు, క్రాంతి చైతన్య, కోదండరామిరెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ పోలీసుస్టేషన్‌కు ఎయిర్‌కండిషనర్ వితరణ



తిరుపతి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పోలీసుశాఖలోనే అనతికాలంగా నిస్వార్థ,అంకితభావ సేవలందిస్తున్న హెడ్‌కానిస్టేబుల్,తిరుపతి జిల్లా పోలీస్ అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి జి.శంకర్‌రెడ్డి 55వేల రూపాయలు విలువైన ఎయిర్ కండిషనర్‌ను విరాళంగా అందించారు. అదే పోలీసుస్టేషన్‌లో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పెద్దకొడుకు జి.చరణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యూఎస్ఎ ఎయిర్ కండిషనర్‌ను వితరణ చేశాడు. దీన్ని మహిళ డిఎస్పీ శ్రీలత, సిఐ తమీంఅహమ్మద్,ఎస్ఐలు శివాజీ, దీపిక ఆధ్వర్యంలో శంకర్‌రెడ్డి స్టేషన్‌కు అందజేశారు. కుటుంబసమస్యలతో స్టేషన్‌కు వచ్చే మహిళలకు, సిబ్బందికి ఉపయోగపడేవిధంగా రెండు టన్నుల సామర్థ్యం ఉన్న ఎయిర్ కండిషనర్ ఇండోర్, ఔట్‌డోర్ యూనిట్‌లు విరాళమిచ్చారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు చరణ్‌రెడ్డి సేవానిరతిని అభినందించారు.

## కూటమికి అన్ని మతాలు సమానమే



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : కూటమికి అన్ని మతాలు సమానమేనని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో పులివర్తి నాని మాట్లాడారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హిందువుల మత కీర్తిని దెబ్బ తీసే కుట్రకు తెరతీస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో గోశాలలో 75 నుంచి 80 ఆవులు మృత్యువాతపడ్డాయని, దీనిపై కరుణాకర్‌రెడ్డి ఎందుకు నోరు మెదపలేదన్నారు. 2021 నుంచి 2024 వరకు టీటీడీ గోశాలకు కుళ్ళిన ధాన్యాన్ని గోవులకు అందించడం బాధాకరమన్నారు. దీనిపై అప్పట్లో భూమన కరుణాకర్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మాజీ తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ గోశాలలో సమగ్ర విచారణ చేపడుతున్నామని, కొంత మంది అధికారులు ఇంకా కరుణాకర్‌రెడ్డికి సహకరిస్తున్నారని, ఏదో సంఘటన చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.ఈ విలేకరుల సమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## బీజేపీకి తగిన బుద్ధి చెపుతాం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : బీజేపీ పార్టీకి తగిన బుద్ధి చెపుతామని కాంగ్రెస్ పార్టీ తిరుపతి మాజీ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానమైన సోనియాగాంధీ,రాహుల్ గాంధీపై లేనిపోని కేసుల్లో, చివరికి ఈడీ కేసుల్లో ఇరికించడం దారుణమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూని చేస్తుందని ఆరోపించారు. అంతే కాకుండా మతాలను రెచ్చగొట్టే విధంగా పార్టీ పాలన సాగుతుందని దుయ్యబట్టారు. త్వరలోబీజేపీకితగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరంకు స్పందన

నింద్ర, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : రాస్ ఆధ్వర్యంలో పాలమంగళం, క్లస్టర్ శ్రీరామాపురంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు హాజరయ్యారు. శంకర్ నేత్రాలయ, చెన్నై ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రవి, శంకర్ నేత్రాలయ వైద్యులు, వేణు, వెంకటముని, సంఘం సభ్యులు శీతాలు, హేమావతి, రాస్ సిబ్బంది ఉషారాణి, తేజ, కనకపల్లి పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం నుండి ఓ మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

-డిఆర్‌డిఏ పిడి టిఎన్ శోభన్‌బాబు



తిరుపతిరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ప్రతి కుటుంబం నుండి ఓ మహిళా వ్యాపార, పారిశ్రామిక వేత్తగా ఎదగాలని డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు ఆకాంక్షించారు. తిరుపతిరూరల్ వెలుగు మండల మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రసంగించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిఎంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి, ముద్ర, పిఎం విశ్వకర్మ పథకాలను మహిళలు అందిపుచ్చుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. సంఘం సమావేశాలకు వందశాతం హాజరై, సమావేశంలో డిజిటల్ లావాదేవీలు నిర్వహించి, పుస్తక నిర్వాహణ అప్‌డెట్‌గా ఉంచుకోవడం వలన సంఘాలలో అవకతవకలు జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు, ఏరియా కో-ఆర్డినేటర్లు వనజాక్షి, ఎంపిఎం పత్తిపాటి నాగేశ్వరరావు, సిసి హాజరయ్యారు.

## విద్యుత్ మీటర్లు ఇవ్వకుంటే...ఉద్యమిస్తాం

తిరుపతిరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో పేదలు నిర్మించుకున్న ఇండ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వకుంటే ఉద్యమిస్తామని తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు బుధవారం ఎపిఎస్పీడిసిఎల్ సిఎండిని వినతిపత్రం అందజేసారు. పేదలు నివసించే గాంధీపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వర్‌నగర్, తుమ్మలగుంట, పేరూరు, వేదాంతపురం, మల్లంగుంట గ్రామ పంచాయతీలలో చాలా మంది పేదలు ఇళ్లు నిర్మించుకుని కరెంట్ మీటర్లు లేక విలవిల లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, తుమ్మలగుంట సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి బుజ్జమ్మ,, గాంధీపురం సర్పంచ్ మన్నూరు లక్ష్మీశివ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కూటమి ప్రభుత్వంలో స్మశానాల అభివృద్ధి ఖాయం : ఎమెల్యే



నారాయణవనం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో స్మశానాల అభివృద్ధి జరుగుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నారాయణవనం స్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణం, దహన వాటిక నిర్మాణాలను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని స్మశానాలకు మహర్దశ కలుగుతుందన్నారు. ఇందులో భాగంగా నారాయణవనం స్మశాన వాటిక అభివృద్ధికి 10లక్షల రూపాయాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా స్మశానాలు అభివృద్ధికి నోచుకోకుంటే తమ దృష్టికి తీసుకొస్తే తప్పక నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అనంతరం చెట్లు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార ్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి శివశంకర్, మాజీ ఎంపిపి పి.గోవిందస్వామి, సర్పంచ్ కెజి శారదమ్మ, రమేష్, అయ్యప్ప శశికళ, ఉప సర్పంచ్ పద్మావతమ్మ, మాజీ సర్పంచ్ కెఎస్ రవిరెడ్డి, మాణిక్యంరెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, ఆర్‌డి ఏకాంబరం, ఎంపిడిఓ గుణశేఖర్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, ఇఇ కెపి షణ్ముగం, కాంట్రాక్టర్ సోడా మణిరెడ్డి, మోహన్, సొరకాయులు, గాండ్ల శివకుమార్, గాండ్ల గోవిందశెట్టి, బాబు, ఊరప్ప, పిజి ముఖేష్, ఇజిఎస్ ఎపిఓ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రెజ్లింగ్లో తిరుపతి విద్యార్థికి బంగారు పతకం



తిరుపతి విద్య, ఏప్రిల్ 16 ప్రభాతవార్త ఇటీవల రాజమండ్రి ఎస్వీపీసీ కన్వెన్షన్ హాల్ లో రెజ్లింగ్ స్టేట్ లెవెల్ ఛాంపియన్షిప్లో తిరుపతికి చెందిన శ్రీ వినాయక స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కే ముత్యాలమ్మ అండర్ 20 కేటగిరీలో బంగారు పతకం సాధించింది.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ బుధవారం వినాయక నర్సింగ్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 20 నుండి 22 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోనీ కోటలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ముత్యాలమ్మ పాల్గొంటుందని,ఆ పోటీల్లో తప్పకుండా పతకం సాధిస్తుందని తెలిపారు.రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర పోటీలలో తిరుపతి జిల్లాకి ఉదయ్ కుమార్ కోచ్ శిక్షణలోనే 18 పతకాలు వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ ఏలియమ్మ జాన్, ట్యూటర్ ఏ గీత, తల్లిదండ్రులు కే.కే మల్లయ్య,రమణమ్మ కోచ్ బి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగునాటకరంగ దినోత్సవం



తిరుపతి(రవాణ),ఏప్రిల్ 16 ప్రభాతవార్త రాయలసీమ రంగస్థలి కళాకారులు బుధవారం తెలుగునాటకరంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తీయందనాల తెలుగువారి పద్యానికి ప్రపంచ దేశాలలో ఎంతో మంచి పేరుందని, మరి ఏ ఇతర భాషల్లోనూ పద్యానికి అంత ప్రాచుర్యం లేదని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు జయంతిని తెలుగునాటకరంగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడంతో తెలుగు కళాకారులు ఈ పండుగను జరుపుకుంటున్నామని అన్నారు. వీరేశలింగంపంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు,. ఈ సందర్భంగా రంగస్థలి నటులు కెఎన్ రాజా, పొన్నాలజేజిరెడ్డి, కప్పా పద్మనాభం, కన్నప్పగారి కేశవులరెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌కు వీరేశలింగం పంతులు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

## నేడు భూ రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు

విజయపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలంలోని కాళికాపురం గ్రామంలో గురువారం ఉదయం 11 గంటలకు, గంగమాంబాపురం గ్రామంలో 12 గంటలకు భూ రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు జరుగుతుందని మండల తహసీల్దార్ ఎస్.కిరణ్, ఆర్ఎస్ డీటీ అశోక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధిత రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు



విజయపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా ఇందులో భాగంగా జేసీబీ సహాయంతో గ్రామం సమీపంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను, చెత్తాచదారాన్ని తొలగించారు. మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామపంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సీనియర్ టీడీపీ నాయకుడు ముని భాస్కర్‌రాజు, మాజీ ఎంపీటీసీ ఏళుమలై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగలు బాబోయ్ దొంగలు



విజయపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు రెచ్చిపోతున్నారు. రెండు నెలల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో రైతులు ఏమి చేయాలో తెలియక తికమక పడుతున్నారు. మండలంలోని ఇళ్ళత్తూరులో ఎంపీటీసీ సరళ వెంకటేశులు పొలం వద్ద రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ చోరీచేసి కాపర్ వైర్ తీసుకుని బాక్సును వదిలి వెళ్లారు. గత నెలలో జంబాడలో డి.నారాయణరాజు పొలం వద్ద, పతార్కాడులో వెంకటేశులురాజు పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో సాగునీరు అందించలేక ఇబ్బంది పడుతుంటే రెచ్చిపోతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ సదాశివం కూడా పోలీసు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

## వైభవంగా మొరవ మహాభారతంలో ధ్వజారోహణం



వెదురుకుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : మండలంలోని మొరవ మహాభారతం వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఆలయం వద్ద చలువ పందిరిలు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం శుద్ధి చేసిపురోహితులు వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్, ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి, ఆభరణాలు, పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మహాభారత యజ్ఞం ప్రారంభించారు. కార్యక్రమంకు ఉభయదాతలు కొండకిందపల్లెకు చెందిన మిట్టపల్లె మోహన్‌రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు. 16 నుంచి 27 వరకు మహాభారత ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి మధ్యాహ్నం 2 గంటలకు హరికథ భాగవతారిణి మధులతచేత హరికథ గానం చేయడం, రాత్రి శ్రీవెంకటేశ్వర నాట్యకళమండలిచే వీధినాటకం జరుగుతుందన్నారు. మహాభారత ఉత్సవాలు జరుగుతున్న రోజుల్లో మధ్యాహ్నం అన్నప్రసాదాలు వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బొడి రెడ్డి మోహన్ రెడ్డి, తారక్ రెడ్డిలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విఘ్నాలను తొలగించి శుభాలు కలిగించు స్వామీ



తిరుపతి(రవాణ),ఏప్రిల్ 17ప్రభాతవార్త: సంకష్టహర చతుర్దశిరోజు విఘ్నాలకు అధిపతి వినాయకుడిని పూజించి వేడుకుంటే అన్నీ శుభాలు జరుగుతాయని వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి సంకట హరచతుర్దశి సందర్భంగా బుధవారం సాయంత్రం వినాయకసాగర్‌లోని వరసిద్దివినాయకునికి ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, మురళి,వాసు, శాంతి, జ్యోతి లక్ష్మి, కృష్ణయ్య, మురళి, వాసు,విజయలక్ష్మి, వాసుదేవరెడ్డి,ఆనంద్ తదితరులతో కలసి అర్చకుడు సురేష్‌స్వామి వినాయకునికి సంకష్టహరచతుర్దశిన ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయకుడిని అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి ప్రసాద వితరణ జరిగింది.

## ఎస్‌సి కార్పొరేషన్ లోన్స్‌కు దరఖాస్తులు

పాకాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త పాకాల మండలం పరిధిలోని ఎస్‌సి రుణం దరఖాస్తు సమయం కొరకు ఎదురు చూస్తున్న వారికొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ సంబంధించి సబ్సిడీ రుణాలు పొందుటకు సైట్ ఓపెన్ చేయడం జరిగింది. ఇందులో ఎస్సీ కులాలకు చెందినవారు వయస్సు 21 - 50 మధ్య వయసుగల వారు దారిద్య రేఖ దిగువ కేటగిరీకి చెందినవారు. ఈ రుణాలకు అర్హులు. పాకాల మండలంలో ఎస్‌సి కులాలకు చెందిన వారు ఏపిఓబిఎంఎంఎస్ సైట్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చును. దరఖాస్తు చేసుకోవాలనుకున్న వారు మీకు సంబంధించిన సచివాలయం నందు వెళ్లినను అక్కడ సిబ్బంది మీ దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా చేయగలరు. దరఖాస్తు చేసుకోవటానికి 10/05/2025 చివరి తేదిగా నిర్ణయించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా పాకాల మండల ఎంపిడిఓ తెలిపారు.

## 3వ రోజు అగ్నిమాపక వారోత్సవాలు



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో నగరి రోడ్డు శ్రీనగర్ కాలనీల్లో శ్రీహరి నివాస్ అపార్ట్‌మెంట్ దాదాపు 40 కుటుంబాల మహిళలకు గ్యాస్ పొయ్యి ప్రమాదంపై ఫైర్ అధికారి నేతాజీ అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బందితో కలసి గ్యాస్ పొయ్యి గురించి అగ్నిపమాక వారోత్సవాలో భాగంగా ఇంటిలో గ్యాస్ లీక్అవుతున్నప్పుడు వంట గదిలో డీజిల్, పెట్రోల్ అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్ నాగేశ్వరరావు, మునిప్రతాప్,విశ్వనాథం శెట్టి, శ్రీనివాసులు, బాల నరసింహులు, ఫైర్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో జపాన్ కంపెనీ ప్రతినిధులు




కోట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టికి ప్రముఖ జపాన్ కంపెనీ మేడిన్‌షా కార్పొరేషన్ ప్రతినిధులు బుధవారం విచ్చేశారు. 2018 నుంచి ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి మేడిన్‌షా కార్పొరేషన్ కంపెనీతో ఉన్న అవగాహన ఒప్పందం ద్వారా టెక్నికల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్ ప్రాంగణ ఎంపికలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు రమేష్‌చంద్ర సింగ్, వినయ్ సిప్లా, టకాయికా సోనోసాన్, యమమోటో ఎండి వకియి విచ్చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. మేనకూరు ప్లాంట్ ఎండి వకియి మాట్లాడుతూ బుల్లెట్ ట్రైన్ అహ్మదాబాద్ టు ఢిల్లీకి సంబంధించిన ఆర్డర్ తమ సంస్థకే వచ్చిందని, తద్వారా రాబోయే పదేళ్లలో మ్యానుఫ్యాక్చరింగ్ ఉంటుందని తెలిపారు. 650 మెగావాట్ల విద్యుత్ రాబోయే ఐదేళ్లలో అవసరం ఉందని, తద్వారా మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు మరెన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2025లో మెకానికల్, ఎలక్ట్రికల్ చదువుతున్న విద్యార్థులకు కంపెనీ ట్రైనింగ్ ఇచ్చి ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్ఓడి డాక్టర్ విక్రమ్‌కుమార్, కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి ఆధునిక నేత్ర వైద్యం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పట్టణంలో నూతనంగా అమెరికన్ లేజర్ నేత్ర వైద్యశాల ద్వారా అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మోదుగుల పార్థసారధి వెల్లడించారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన కంటి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల ప్రజలు నెల్లూరు, చెన్నై వంటి ప్రాంతాలకు కంటి వైద్యం కోసం వెళ్లకుండా ఇక్కడే చికిత్సలు పొందవచ్చని ఆయన తెలిపారు. రెండు నెలల పాటు ఉచితంగా ఓపీ నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 23 బ్రాంచిలతో తమ అమెరికన్ లేజర్ నేత్ర వైద్యశాల పనిచేస్తుందన్నారు. 23వ బ్రాంచ్‌గా సూళ్లూరుపేటలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ రమేష్ చంద్ర ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మోదుగుల విజయ్‌కుమార్, మోదుగుల అరుణ, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కోట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని సాయి అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అగ్నిమాపకశాఖ అధికారి హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనుకోకుండా అపార్ట్ మెంట్‌లో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వినయ్, నరసింహం, శ్రీహరి, సునీల్, సిహెచ్ దుర్గాప్రసాద్, కె.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు : డీఎస్పీ



బాలాయపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మల్లెమాల గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తిపై ఫోక్స్ నమోదు డి.ఎస్.పి గీత తెలిపారు. నిందుతుడు పోలయ్య, బాలికను పోలీస్ స్టేషన్ కు పిలిపించి కేసు విషయమై డిఎస్పీ గీత విచారించారు. బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి గర్భవతి చేశాడని కేసు నమోదు చేశారు. పోలయ్యపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చూస్తున్నామని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టరీత్యా జైలుకు పంపుతాము హెచ్చరించారు.

## ఈ-అబ్యాస్ ఒలంపియాడ్ పరీక్షలలో స్టేట్ ర్యాంకులు




గూడూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఈ-అభ్యాస్ అకాడమీ నిర్వహించిన ఐఐటి ఒలంపియాడ్ పరీక్షలలో స్టేట్ ర్యాంకులు మినర్వా స్కూలు విద్యార్థులు సాధించారు. ఈ-అభ్యాస్ అకాడమీ గుంటూరులో నిర్వహించిన ఈ అభ్యాస్ ఉత్సవ్-2025 ఐఐటి-ఒలంపియాడ్ ఓరియం టేషన్ సి-బ్యాట్, ఏ-మ్యాట్, ఆర్-ఎస్ఎం, ఆర్-ఎంఎం వంటి వివిధ ఒలంపియాడ్‌లలో 1,2,3 ర్యాంకులు సాధించి, పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ మొత్తం 17 మంది విద్యార్థులు ఈ పరీక్షలలో స్టేట్ ర్యాంకులు సాధించారు. ఇందులో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు పాల్గొని స్కూల్‌లో వారి పిల్లలు అవార్డులు పొందినందుకు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ స్కూలు యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు.

## అజీబాబుకి అంబేద్కర్ ప్రతిభా పురస్కారం



గూడూరు,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలంలో భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించే సహిత విద్యా ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పసల అజీబాబు రావుకి అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో స్తోత్రన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్‌సి, ఎస్‌పిఎల్‌టిఓ ప్రతినిధి నాగయ్య చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. గూడూరు ఎంఈఓ కాంచన, ఎంఆర్‌సి స్టాఫ్, మండల ఉపాధ్యాయులు బంధుమిత్రులు తదితరులు జాతీయ పురస్కారం రావడంపై అభినందనలు తెలిపారు.

## తడలో గాలివాన

తడ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: తడ ప్రాంతంలో బుధవారం ఉదయం గాలివాన భయపెట్టింది. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీయడం, ఉరుములు మెరుపులతో వర్షం కురవడం వలన ఒక్కసారిగా తుపాను వాతావరణం ఏర్పడింది. అయితే గంట సేపటి తర్వాత మళ్లీ వర్షం వెలిసి సాధారణ వాతావరణానికి వచ్చింది. ఈ వర్షం వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనంగా మారిందని, అయితే వర్షం తీవ్రత పెరిగి ఉంటే వేసవి కాలపు పంటలు పుచ్చ, దోస వంటివి వేసుకున్న రైతులకు మాత్రం నష్టం కలిగి ఉండేదని కొందరు తెలిపారు.

## గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలి : సిడిపిఓ



వెంకటగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకుంటే తల్లి బిడ్డఆరోగ్యంగా ఉండాలని సిడిపిఓ షాంషాద్ బేగం తెలిపారు. సిడిపిఓ కార్యాలయం వద్దపోషణ్ పక్వాడ కార్యక్రమ లో భాగంగా గర్భవతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1000 రోజులు కార్యక్రమం గురించి ఆమె వివరించారు. గర్భం దాల్చినప్పటి నుండి డెలివరీ అయిన రెండు సంవత్సరాలు వరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని సూచించారు. గర్భవతులకు పలుసూచనలు ఇచ్చారు.

## అకాలవర్షంతో...అన్నదాతలకు అపార నష్టం!

నాయుడుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనద్రోణి ప్రభావంతో బుధవారం నాయుడుపేట మండలంలో కురిసిన గాలివానకు అన్నదాతలకు అపార నష్టం వాట్లింది. నాయుడుపేట- దొరవారిసత్రం మండలంలో రైతులు ముఖ్యంగా వేరుశనగ,మిరపను ఆధునిక పద్ధతుల్లో సాగుచేపట్టారు. ప్రస్తుతం ఆ పంట కోతదశలో ఉండగా ఒక్కసారిగా గాలివాన కురవడంతో పంటపొలాల్లో నీరుచేరడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి, పూలతోట, వడ్డికండ్రిగ, ఆనేపూడి తదితర గ్రామాల్లో రైతులు మిరప,వేరుశెనగను కల్లాల్లో ఆరబెడుతుండగా ఇక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన కురవడంతో పంటను వర్షంకు తడవకుండా అన్నదాతలు అవస్థలు వర్ణాతీతంగా మారింది.

## నేటి విద్యార్థులే భావిభారత పౌరులు

గూడూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సత్యం ఒలింపియాడ్ ఐఐటీ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 1,2,3 ర్యాంకులు, పాఠశాల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, పతకాలు ప్రధానం చేశారు. ఈ అవార్డు ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతు విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడం విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. మరో అతిథి కడివేటి చంద్రశేఖర్ మట్లాడుతూ విద్యార్థులలోని అంతర్గత ప్రతిభ ను వెలికి తీయడమే లక్ష్యంగా శ్రీ గాయత్రి స్కూల్ యాజమాన్యం సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు సుప్రజ, శిరీష, ధనశ్రీ, రాఘవయ్య, రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధి కూటమితోనే సాధ్యం : ఎమ్మెల్యే



గూడూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి చంద్రబాబు నాయుడు రుజువు చేశారని శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. గతంలో రాజీవ్ రంజాన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించింది. వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. జీవో ప్రకారం ఎస్సీలను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా వర్గీకరించారు. రోస్టర్ పాయింట్ల ప్రకారం ఉద్యోగాలలో కూడా సమన్యాయం జరుగుతుందని అన్నారు.

## వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



గూడూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పట్టణంలోని వివేకానంద రోడ్డులో కొలువై ఉన్న శ్రీ రామ మందిరంలో పట్టణ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఉభయ దాతలుగా ముఠా యూనియన్ వర్కర్స్ నాయకులు గారా బాబూరావు, సరస్వతి, ధనుంజయ రావు, రమ్య కృష్ణ దంపతులు వ్యవహరించారు.

# గూడూరు డివిజన్

## ప్రోబయోటిక్ ఫార్మింగ్‌పై అవగాహన



వాకాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకడులోని బుధవారం సిపి ఆక్వా కల్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు రొయ్యల సాగుపై అవగాహన కల్పించారు. సందర్భంగా సిపి ఆక్వా కల్చర్ జనరల్ మేనేజర్ గణేష్ మూర్తి, డిపార్ట్మెంట్ మేనేజర్ పిఎన్ సురేష్‌లు మాట్లాడుతూ ఈ సమ్మర్ క్రాప్‌లో ఆక్వా రైతులుకు ఆక్వా కల్చర్‌పై పలు సూచనలు సలహాలు అందజేశారు, ప్రస్తుతం రొయ్యల సాగుల సమస్యలపై, సాగు విధానం అవగాహన కల్పించడం జరిగింది, ముఖ్యంగా ఈ సమ్మర్ క్రాప్‌లో రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో సమస్యలు రైతులు ఎదుర్కొం టున్నారని ఈ సమస్యను రొయ్యలను ఎలా కాపాడుకోవాలో, అలాగే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందేలా సూచనలు అందజేశారు, ప్రస్తుతం ఈ సమ్మర్ క్రాప్‌లో ప్రోబయోటిక్ ఫార్మ్ కల్చర్ చేయాలని సూచించారు, ఆంటి బయోటిక్ పూర్తి నిషేధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు, సిపి ఆక్వా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డి.వి సత్రంలో ఇసుక కష్టాలు

దొరవారిసత్రం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదు సంవత్సరాల వైఎస్ఆర్సిపి పాలనలో ఇసుక అందుబాటులో లేక అధిక ధరలకు సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేక భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయి భవన నిర్మాణ వ్యవస్థ కుదేలు అవడంతో భవన నిర్మాణ కార్మికులు ,సామాన్యకూలీ చేసుకునే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాని నూతనంగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విదానాన్ని తీసుకు రావడంతో రాష్ట్ర ప్రజలు ఆనందాన్ని వ్యక్తపరిచారు.రాష్ట్ర వ్యాప్తంగా అమలవు తున్న ఉచిత ఇసుక ఫాలసీ దొరవారిసత్రం మండలంలో మాత్రం ప్రజలకు అందుబాటులో లేదంటు మండల ప్రజలు వాపోతున్నారు.దొరవారిసత్రం మండల పరిధిలో ప్రభుత్వం ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేయక పోవడంతో మండల ప్రజలకు ఇసుక కష్టాలు తప్పట్లేదు.ఇదే అదునుగా చేసుకుని కొందరు వ్యాపారస్తులు,వైసిపి నాయకులు మండల పరిధిలోని ఇసుక పాయింటుల వద్ద ముటాగా ఏర్పడి ఇసుకను పక్క మండలాలకు,కంపెనీలకు తరలిస్తూ సామాన్య ప్రజలను ఇసుకను తీయనియకుండా ఇబ్బందులు పెడుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. మండల రెవేన్యూ అధికారులు ప్రభుత్వ ఉచిత ఇసుకను సామాన్య ప్రజలకు అందనీయకుండా ఇబ్బంది పెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని ప్రతి ఒక్కరు ఉచిత ఇసుకను అందేలా చూడాలని కోరారు.

## జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలి : సిఐటియు




వెంకటగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులకు, చెత్త వాహనాల డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు 15000 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఈ వేతనంతో భార్యా బిడ్డలు కుటుంబం ఎలా గడవాలని ప్రశ్నించారు. గత సమ్మె కాలం ఒప్పందంలో భాగంగా ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం 21,000 వేల రూపాయలు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంకటగిరి మున్సిపాలిటీలో మాత్రం చెత్త వాహనాల డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం 24,500 రూపాయలు చెల్లించడం లేదని అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, వెంకటగిరి పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మనీ, నాగరాజు, కిష్టమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

## కోదండరామునికి ఘనంగా విమానోత్సవం



తవణంపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి విమానోత్సవం సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన బ్రాహ్మణ వంశస్థులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే రాత్రి అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అలంకరించిన వాహనవాహనంపై వుంచి ప్రత్యేక ప్రత్యేక బాణాసంచా పేలుళ్ల, మంగళవాయిద్యాల నడుమ అరగొండ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులు,అర్చకులు ప్రసాద్‌స్వామి, ఉత్సవ ఉభయదారులు, అరగొండ పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీ కొన్న శ్రీసిటి బస్సు...నలుగురికి తీవ్రగాయాలు

నాయుడుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : మండలంలోని పుదూరు వద్ద ఆటోను శ్రీసిటిబస్సు ఢీ కొనడంతో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం జరిగింది.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. ఆటో కొత్తగుంట నుండి ప్రయాణికులతో నాయుడుపేటకు వెళుతుండగా మార్గమధ్యలో పుదూరు వద్దకు వచ్చేసరికి అదేమార్గంలో నాయుడుపేటవైపు నుండి మల్లాంవైపు వెళుతున్న శ్రీసిటిబస్సు ప్రమాదవశాత్తు ఆటోను ఢీ కొంది.దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సుడ్రైవర్ అతివేగంగా డ్రైవింగ్ చేయడం వల్లన ప్రమాదం జరిగిందన్నారు.నాయుడుపేట సిఐ బాబి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టిడిపి ప్రజాదర్బార్‌కు 64 వినతులు

తిరుపతి,ఏప్రిల్ 16ప్రభాతవార్త: రాష్ట్రపార్టీ ఆదేశాలమేరకు తిరుపతి నియోజక వర్గంలో రెండవవారం కొనసాగిన ప్రజాదర్బార్‌కు 64 వినతులు అందాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, నగర అధ్యక్షుడు వట్టికుంట చిన్నబాబు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివ, నాయకులు బుల్లెట్ రమణ, శ్రీధర్‌వర్మ, బిజి కృష్ణయాదవ్, మునిశేఖర్‌రాయల్, మన్నెం శ్రీనివాసులు, విశ్వనాథం, రాజారామ్ పాల్గొన్నారు .ప్రజల నుండి సంయమనంతో వినతులు స్వీకరించారు. రెవెన్యూ, మున్సిపాల్టీకి సంబంధించి సమస్యలు ఫిర్యాదులు అందాయి.

## రాష్ట్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌తో ముందు నడుస్తోంది

**-కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మండిపాటు**



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: నేషనల్ హెరాల్ కేసులో మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ మరియు రాహుల్ గాంధీ పేర్లతో రెండు రోజుల క్రితం ఈడి డైరెక్టరేట్ చార్జ్ షీటు దాఖలు చేసిందని కాంగ్రెస్‌పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ కోర్టులో దాఖలు చేసిన ఫిటిషన్‌పై ఈనెల 25న డిల్లీరౌస్ అవిన్యూ కోర్టులోచార్జ్‌షీట్‌పై విచారణ జరగనుందని గాంధీ, నెహ్రూ కుటుంబాలపై బిజెపి ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేయడం తద్వారా పార్టీ నాయకులను, వారిపై ఇన్‌కంట్యాక్స్, ఈడి, సిబిఐ తదితర సంస్థలకు ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలను భయబ్రాంతులను చేస్తూదేశంలోని 10 కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని కనీసం పార్లమెంటులో వాక్‌బోర్డు మీద సవరణలు చేసి ప్రతిపక్షాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా పార్ల మెంటులో ఉభయసభల్లో ఏకపక్షంగా ఆమోదం చేసుకున్నారన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని దిక్కరిస్తూ పోతున్నారని దీనికి ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని లేకుంటే రాబోవు రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్లు కూడా రాజ్యాంగం నుంచి తొలగిస్తారని కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## సంస్కృత నివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రాజభాషా సమితి బృందం

తిరుపతి విద్య ఏప్రిల్,16 ప్రభాతవార్త : జాతీయ సంస్కృత వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్ నందు భాదవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, రాజభాషా సమితి సభ్యులు డా.కిశోర్ కుమార్, వి.కె. సుదర్శన దేవి విశ్వవిద్యాలయంలో రాజభాష అయినటువంటి హిందీ భాషను కార్యాలయ ఆదేశాలలో ఎంత వరకు అమలు చేస్తూన్నారు అనే అంశంపై పరిశీలించడం జరిగినది. డా.కిశోర్ కుమార్ మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి నందు రాజభాష విభాగం ద్వారా మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యూనివర్సిటీ నందు కార్యాలయ ప్రశాసనం మరియు విభిన్న విభాగాలలో రాజభాష హిందీలో అన్ని కార్యకాలాపాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమం లో విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్లా, పరీక్షా నియంత్రకులు డా.కె.సాంబశివమూర్తి, ప్రొక్టర్ ప్రొ.సి. రంగనాథన్, రాజభాష

**పుత్తూరు పురపాలక సంఘము,పుత్తూరు**

ఆర్.ఓ.సి.నెం.607/ఇ1/2012 తేది : 16-04-2025

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

పుత్తూరు పురపాలక సంఘము నందు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి 3 పనులకుగాను (టెండరు నిట్ నెం.54, 61/2024-25 మరియు 1/2025-26) అర్హతలు కలిగినవారు నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను. http://tender.apeprocurement.gov.in

**కమిషనరు, పుత్తూరు పురపాలక సంఘం**

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి: తిరుపతి కమిషనర్




శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ఎదగాలని వృత్తినైపుణ్యాల్లో రాణించాలని తిరుపతి కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. బుధవారం శ్రీకాళహస్తిలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ (ఈసిఎల్), శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీ సారథ్యంలో వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సభకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్‌ఖండేల్వాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలను జనరల్ మేనేజర్ దొరైరాజ్ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు.సభకు ముఖ్యఅతిధిగా హాజరైన తిరుపతి కమిషనర్ ఎన్ మౌర్య మాట్లాడుతూ మహిళలు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. నేటి సమాజంలో ఒక్కరి సంపాదనతో కుటుం బాలు గడవటం కష్టంగా మారిందన్నారు. కాబట్టి మహిళలు కూడా రాణించాలన్నారు. శ్రీకాళహస్తిపైప్స్ నిర్వహిస్తున్న మహిళా అభ్యున్నతికి సంబంధించిన కోర్సులను చేపట్టడం ఎంతో అభినందించదగ్గ విషయం అన్నారు. ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు రికార్డులను బట్టి తెలుస్తుందన్నారు.ఈ సిఎల్ సంస్థ పరిసరాల్లోని మహిళల అభ్యున్నతికి కృషి చేయటం అభినందనీయం అన్నారు. మహిళలు విద్యతో పాటు స్వయంసమృద్ధి ఆర్థిక పరిపుష్టకి టైలరింగ్,బ్యూటీషియన్ కోర్సులను నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు. డిజిటల్ మీడియా ద్వారా మనం ప్రచారం చేసుకునే అవకాశం ఉందని మౌర్య వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం చల్లగా ఉంటుందని పిల్లలు ప్రయోజ కులౌతారని మౌర్య మహిళలకు వివరించారు. ప్రతిమహిళ కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని ఆమె కోరారు. డైరెక్టర్ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆందులో భాగంగా టైలరింగ్,ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటిషియన్ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు వంటి వాటిలో మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నా మని పారిశ్రామిక వినియోగం కోసం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నీటిని తీసుకుంటున్నామని తెలిపారు. దీనివల్ల ఈ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతున్నాయని వివరించారు. ఇది వ్యవసాయానికి ఎంతో తోడ్పడుతుందని తెలిపారు.జనరల్ మేనేజర్ దొరైరాజ్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిసరాల్లో జీవనోపాధి,ఆరోగ్యాన్ని మెరుగుపరచటం మహిళల ఆర్థిక ఆభివృద్ధికి స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కంపెనీ ఎదుగుదలతో పాటు ప్రజల ఎదుగుదల ముఖ్యమనే నినాదంతో ముందుకు వెళుతున్నామని దొరైరాజ్ వివరించారు.ఈ సందర్భంగా కంపెనీ ఆవరణలో మొక్కలు నాటారు.

## ఘనంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు సంకష్ట చతుర్థి వ్రతం మహాత్యాన్ని గురి ంచి వివరించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. ఆలయ అధికారులు, ఆస్థాన మండపంలో భక్తులు సకాలంలో వ్రతాన్ని నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,రవి, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## టిటిడిని ప్రక్షాళన చేసేలా సిఎం చర్యలు : ప్రభుత్వ విప్



కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : వైఎస్సార్సీ పాలనలో పవిత్రమైన టిటిడిని అవినీతి, అక్రమాల్లో ముంచితే ప్రస్తుతం సిఎం చంద్రబాబు నాయుడు ప్రక్షాళన చేసేలా చర్యలు చేపట్టారని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర నేత బిఆర్ సురేష్‌బాబులతో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జగన్‌రెడ్డి టిటిడిని రాజకీయ కేంద్రంగా మార్చేశార న్నారు. శ్రీవాణి ట్రస్ట్‌లో పదివేల రూపాయల టికెట్లలో కుంభకోణాలు చేశారన్నారు. పరకామణిలో చోరీ జరిగిందన్నారు. ప్రస్తుతం గోశాలలో గోవులు మృతి చెందాయని మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు. వైఎస్సార్సీ హయాంలో టికెట్ల దగ్గరనుంచి దళారుల దారా రోజూ ఐదు లక్షల మేర వసూలు చేసి ఘనత ఎవరిదో ప్రజలకే తెలుసన్నారు. చిరుతల సంచారం సమయంలో గతంలో ప్రజల చేతికి కర్రలు ఇచ్చిన భూమన నేడు భక్తుల మనోభావాలు దెబ్బతీయడం తగదన్నారు. గతంలో జగన్ టిటిడి కనీస నియమాలు సైతం పాటించలేదన్న విషయం గుర్తు చేశారు. ఏరోజైనా ఆయన సతీమణితో వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్సీ పాలనలో భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో టిటిడిలో మాజీ మంత్రి రోజాతో సహా టికెట్ల వ్యాపారం చేసింది వాస్తవం కాదా?అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేత వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, మాజీ సర్పంచ్ వల్లెప్ప, తెలుగు మహిళ నాయకురాలు సుగుణమ్మ పాల్గొన్నారు.